# WHAT IS LUTHERAN?
## (లూథరన్ అనగానేమి?)

సహజంగా మార్టిన్ లూథర్‌ను అనుసరించువారిని లూథరన్ అందురు. అది తప్పు. మేము యేసుక్రీస్తును అనుసరించువారము. నీవలె, నావలె మార్టిన్ లూథర్ గూడా దేవుని వాక్యమందలి సంపదను లోకమునకు మోసుకొని వెళ్ళు లోకసంబంధమైన పాత్రలు. మనము సామాన్యమైన మట్టి పాత్రలమై పాపముతో నిండియుండి, క్రీస్తునందలి విమోచన ద్వారా గొప్ప మహిమతోనున్న సంపదను కలిగియున్నాము. మనము మార్టిన్ లూథరు వలె రక్షించబడి యున్నామని నమ్ముచున్నాము.

కేవలము కృప ద్వారా, విశ్వాసము ద్వారా, క్రీస్తు ద్వారా, దేవుని వాక్యం ద్వారా మాత్రమే రక్షింపబడియున్నామని నమ్ముచున్నాము. మనము ఇతర సంఘములనుండి వేరు పరచబడినట్లు తెలుపుటకు లూథరు పేరును వాడుదుము. "లూథరన్" పేరు ధరించిన యితర సంఘములనుండి మనలను వేరు చేసికొనుటకు, మనలను "లూథరన్ ఒప్పుకోలు " సంఘమని పిలుచుకొనుచున్నాము.

**We are saved by grace alone : (మనము కృప చేతనే రక్షించబడియున్నాము)**

విశ్వాసము ద్వారా కృప చేతనే మీరు రక్షించబడియున్నారు. ఇది మీ క్రియలవలననైనది కాదు. ఇది దేవుని వరమే. క్రియలవలననని ఏ మనుష్యుడు అతిశయించకుండునట్లు ...... ఎఫెసి 2: 8-9

కృప అనగా ప్రతిఫలము కోరక యిష్టపడుట లేక అపాత్రులయెడల ప్రేమ. అది క్రీస్తు యేసు నందును, ఆయన చేసిన రక్షణ కార్యము వలనను మనకు కానుకగా యివ్వబడినది. పరలోకం పొందుటకు మనమేమి చేయలేము. క్రీస్తునందు అది మనకు ఉచితముగా యివ్వబడిన (కానుక), బహుమానము. ఆయన యిష్టపూర్వకముగా ఈ లోకములోనికి వచ్చి, మనము జీవించలేని పరిశుద్ధ జీవితమును జీవించెను. ఆయన ఇది చేసి దేవుని యొక్కచిత్తమును పరిపూర్ణముగ నెరవేర్చెను. "మీ దేవుడనైన నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులైయుండుడని" దేవుడు చెప్పెను. మనము అపరిశుద్ధులమని తెలియుచున్నది. గనుక మన యేసు మనకు బదులుగా పరిశుద్ధ జీవితము మనకొరకు జీవించెను.

దేవుడు గూడా పాపమునకు శిక్షను కోరుచున్నాడు. మీరు ఒక ఆజ్ఞను మీరినట్లైతే అన్నింటిని మీరినట్లే, పాపము చేయు ఆత్మ తప్పక చనిపోవును. యేసు మనకు బదులుగా పరిశుద్ధ జీవితం జీవించుటే గాక మన శిక్షను ఆయన మీద వేసుకుని చనిపోయెను. 'కాగా అతడు మన పాపములను బట్టి గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదా పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. యేసయా 53:5. అపాత్రులైన వారి కొరకు ఆయన యిది చేసెను. తప్పిపోయిన పాపులమైన మనపట్ల ఆయన ఎట్టి ప్రేమను కలిగియున్నాడు!

"సమాప్తమైనది, తప్పిపోయిన లోకమును రక్షించు పని సమాప్తమైనది" ఆయన సిలువలో చనిపోవునపుడు చెప్పెను. దేవుడు పరిశుద్ధతను కోరుచున్నాడు. యేసు పరిశుద్ధమైన గొఱ్ఱె పిల్లయై యున్నాడు. దేవుడు పాపమునకు శిక్షను కోరుచున్నాడు. మరియు ఆశిక్ష భరించుటకు తన యేకైక కుమారుని పంపియున్నాడు.

ఇప్పుడు పౌలు " ఇది దేవుని వరమని, ఈ రక్షణ క్రీస్తు ద్వారా విజయమని" వ్రాయుచున్నాడు. ఏంటి? ఎవరైనా కోటి డాలర్లతో మీ గుమ్మము దగ్గరకొచ్చారా? అతను వస్తున్నట్లు నీకు తెలియదు. నీవు సోమరివైయుండి, ఆసమయంలో పనిచేయుట లేదు. ఆ డబ్బు సరాసరి నీ దగ్గరకొచ్చియున్నది. నీవు దానికొరకు పని చేయలేదు. నీవు తప్పక దానివలన లాభము పొందలేవు. యేసునందు రక్షణ అట్టిదే. అది ఒక బహుమానము. ప్రేమ గల నీదేవుని కృపాహస్తమునుండి అది వచ్చుచున్నది. నీ జీవితమంతా నీవు పని చేయనిచో దానివలన నీవెన్నడూ లాభము పొందలేవు.

విచారించవలసినది ఏమనగా, యిప్పుడు దానివలన మేలు పొందగలమని కొందరు చెప్పుచున్నారు. దానికొరకు పని చేసినచో మనము కొద్దిభాగమైనా సంపాదించగలమనుచున్నారు. లూథరన్ దిద్దుబాటుకు కారణమేమనగా సంఘము కృప ద్వారా, క్రియల ద్వారా రక్షించబడినదని బోధించి, పాప పత్రములచే బంధించుచున్నది. మరిము కృప ద్వారాయై యున్నపుడు, క్రియల ద్వారా కాదు. కృప ద్వారా మాత్రమే రక్షింపబడియున్నామను సత్యబోధ ద్వారా తన ప్రజలను తిరిగి రప్పించుటకు దేవుడు ఈ దిద్దుబాటును వాడుకొని యున్నాడు. "వారు క్రీస్తు యేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా కృప చేతనే నీతిమంతులుగా తీరచబడియున్నారు." రోమా 3:24.

మేరి (మరియ) యితర విశ్వాసులు వారంతట వారే జీవితంలో గొప్పవారై, వారి జీవితాలలో చేసిన పాపయును పోగొట్టుకొన్నారని రోమన్ కేథలిన్ సంఘము అప్పుడు బోధించి, యిప్పుడును బోధించుచున్నది. వీరందరూ వారు పొందవలసిన దానికన్న గొప్ప లాభము పొందియున్నారని వారు చెప్పుచున్నారు. ఎంత బుద్ధిహీనమైన మాట! మానవులందరు రక్షించబడవలసిన పాపులని సువార్త చెప్పుచున్నది. రక్షణలో కొంతభాగము దేవుని యొద్దనుండి, మరికొంత భాగము మనుష్యుల క్రియ వలన అవసరము లేదు. "ఏ భేదమును లేదు.

మనుష్యులందరు పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు.'' రోమా 3:22-23.

రోమన్ కేథలిక్ సంఘము కృప ద్వారానే రక్షించబడి యున్నామను బోధను వేరు చేయుచున్నది. గనుక మనము రోమన్ కేథలిక్ సంఘమునుండి ప్రత్యేకించబడినాము. మనము లూథరన్‌గా పిలువబడుచున్నాము. ఎందుకనగా లూథరు వలె మనము వాక్యమును నమ్ముచున్నాము.

## We are saved by faith alone : (మనము విశ్వాసముద్వారానే రక్షించబడియున్నాము.)

''ధర్మ శాస్త్ర సంబంధమైన క్రియలులే కుండనే మనుష్యుడు విశ్వాసము ద్వారా నీతిమంతుడుగా తీర్చబడుచున్నాడు.'' రోమా 3:28.

మార్టిన్ లూథరు రోమా పత్రిక, గలతీ పత్రిక ప్రత్యేకించి చదువుట వలన పరిశుద్ధాత్మ శక్తి వలన మనము విశ్వాసము ద్వారా రక్షించబడియున్నామని గ్రహించెను. కుమారుని ద్వారా మనము తండ్రి దృష్టిలో నీతిమంతులముగా ఎంచబడుచున్నాము. క్రీస్తు నీతి మన పాపమును, అవినీతిమత్వమును కప్పుచున్నది. తండ్రి మన రక్షకుడైన క్రీస్తు ద్వారా చూచినపుడు ఆయన తన స్వంత బిడ్డలుగా చూచుచున్నాడు. మనము విశ్వాసము ద్వారా క్రీస్తు నీతిని కలిగియున్నాము. క్రీస్తు యేసునందు విశ్వాసముంచు వారందరు నీతిమంతులుగా తీర్చబడుచున్నారు. రోమా 3:22. '' కాబట్టి నమ్మువారు ఆయన కృప చేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమి వలన ఉపేక్షించినందున ఆయన తన నీతిని కనపరచవలెననని, క్రీస్తు యేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలు పరచెను.'' రోమా 3:24-25. మనము ఉచితముగా విశ్వాసముద్వారా రక్షించబడియున్నాము. మనము దానికొరకు క్రియలు చేసినందున లేక అర్హులమైనందున కాదు. విశ్వాసము రక్షణ అను బహుమానమును అందుకొను హస్తము అని చెప్పవలెను. దానికిమించి అది ఏమి కాదు. భూమి వర్షమును పొందునట్లుగా విశ్వాసము దేవుడు మానవుని మీద ఉంచిన క్రియ కాదని, మానవుడు ఉన్నత ఉద్దేశ్యములు కలిగియుండాలనెడి తప్పుడు బోధ సంఘములో వ్యాపించియున్నది. లూథరు చిన్న ప్రశ్నోత్తరిలో చెప్పినట్లు మనము నమ్ముచున్నాము. ''నా శక్తి, సామర్థ్యాలవలన కాక, క్రీస్తు యేసునందలి విశ్వాసము ద్వారా, నా ప్రభువు యొద్దకు వచ్చుట వలన, పరిశుద్ధాత్ముడు నన్ను సువార్త ద్వారా పిలిచినందున, ఆయన వరములతో నన్ను వెలిగించినందున, నన్ను పవిత్రపరచి, సత్యవిశ్వాసమున నిలిపినందున, ఆయన పిలిచినవిధముగా, సమకూర్చుచు వెలిగించుచూ, పరిశుద్ధ పరచుచూ, భూమి మీదనున్న క్రైస్తవ సంఘమంతటినీ, క్రీస్తు యేసునందు ఒకే విశ్వాసంలో నిలుపుచూ .......'' అని నేను నమ్ముచున్నాను. అది నా స్వంత శక్తి సామర్థ్యాల వలన కాదని, నేను నమ్ముచున్నాను. కావున అది కృప ద్వారానే తప్ప మరి దేనివలన కాదు. విశ్వాసము కేవలము పరిశుద్ధాత్మ ద్వారా నింపబడి, పొందుకొను హస్తము.

విశ్వసించుట మానవుని గొప్పతనమని చెప్పు ఇతరక్రైస్తవ సంఘములనుండి, లూథరనులుగా మనము ప్రత్యేకించబడినాము. కొందరు అది వారి పనియైనట్లుగా క్రీస్తు కొరకు తమ 'తీర్మానమని'' చెప్పుదురు. నిజముగా యేసు తన శిష్యులకు చెప్పియున్నారు. ''మీరు నన్నేర్పరచుకొనలేదు. నేను మిమ్ములను ఏర్పరచుకొనియున్నాను.'' కొందరు నమ్మునట్లుగా విశ్వాసమునకు లోబడి యున్నామని చెప్పుదురు లేదా ఇతరులకన్నా వారు ఎక్కువ పరిశుద్ధాత్మ కలిగియున్నారని చెప్పుదురు. పాపియైన మనుష్యుడు మార్చబడినట్లున్నది. పరి పౌలు విశ్వసించుటకు, లోబర్చబడియున్నాడా? లేదా అతడు ఇతరులకంటే ఎక్కువ పరిశుద్ధాత్మ శక్తి కలిగియున్నాడా? బహుశా కాదు. మార్గమును భయంకరరంగా వ్యతిరేఖించిన మనుష్యునిగా కనుగొనగలము. అతడు భయపెట్టుట, చంపుట ప్రాణాధారముగా చేసుకొనెను.. ''సౌలయితే ఇంటింట జొచ్చి, పురుషులను, స్త్రీలను ఈడ్చుకునిపోయి, చెరసాలలో వేయించి, సంఘమును పాడుచేయుచుండెను.'' అ.కా 8:3. శిక్షార్హుడైన సౌలు దేవుని శక్తిద్వారా పొస్తలుడైన పౌలుగా, సువార్తికునిగా మారెను.

దేవుడు మానవుని మార్చుటలో మానవుని సహకారమున్నదని మరికొందరు చెప్పుదురు. ఆత్మలేని మనుష్యుడు ఆత్మ సంగతులను పూర్తిగా నిర్లక్ష్యపెట్టును. మార్పులేని వ్యక్తి పాపములో చనిపోయి ఉన్నాడు. మీరు అపరాధముల చేతను, పాపములవలనను చచ్చియుండగా ఆయన మిమ్మును బ్రతికించెను. ఎఫెసి 2:1 ఆత్మ లేని మనుష్యుడు దేవుని యొక్క ఆత్మ వరములను పొందలేడు, ఎందుకనగా అవి అతనికి వెర్రితనముగా ఉన్నవి. అవి ఆత్మానుభవముచేతనే వివేచింపదగును. గనుక అతడు వాటిని గ్రహింపజాలడు. 1 కొరి 2:14 చనిపోయినవారు అంత్యదినమున కేవలము దేవుని ఆత్మశక్తి ద్వారా లేపబడుదురు. ఇట్టి మార్పునందు దేవుని ఆత్మశక్తి ద్వారా మాత్రమే ఆత్మీయముగా చనిపోయినవారు క్రీస్తు యేసు నందు బ్రతికింపబడుదురు. పరిశుద్ధాత్మ శక్తి ద్వారా తప్ప ఏ మనుష్యుడును యేసు ప్రభువని చెప్పడు. ఆయన మాట ఆయుధము మరియు పరిశుద్ధాత్మ యొక్క కత్తి. పిలుచునది, సమకూర్చునది, వెలిగించునది, పరిశుద్ధపరచునది పరిశుద్ధాత్ముడై యున్నాడు. లూథరన్‌లు సువార్త ద్వారా నమ్మిన దేమనగా పరిశుద్ధాత్ముడు విశ్వాసమునకు రూపు కల్పించునని. ఈ విశ్వాసము దేవుని వరము, దేవుని రక్షణ ఎట్లో అట్లే. క్రియల వలన గాక, విశ్వాసము ద్వారా, విశ్వాసము అను ఆత్మ ఆకారము వలన మనము రక్షించబడినాము.

## We are saved by christ alone: (మనము క్రీస్తు వలననే రక్షింపబడినాము.)

ఆకాశము క్రింద యియ్యబడిన ఏ నామమువలన రక్షణ లేదు గానీ ఈ నామము వలననే మనము రక్షించబడుదుము. అ.కా 4:12 సువార్త అంతా యేసు విమోచనకుడని తెలుపుచున్నది. ఆ.కాం 3:15 నుండి మిలాకి 4:2 వరకు ఆయనపాత నిబందన ప్రవచనము అంతయు నెరవేర్చెను. ఆయన ఆదియు అంతమునైయున్నాడు. మనకు తోడైయున్న ఆయనే ఇమ్మానుయేలు.

సువార్త స్పష్టముగానున్ననూ, పెద్ద క్రైస్తవ శాఖయైన రోమన్ కేథలిక్ వారు మరియును మధ్యవర్తిగా కలిగి, కుమారునితో విన్నవించుచున్నారు. రక్షకుడే రక్షకుడై యున్నాడు. "దేవుడు ఒక్కడే. దేవునికి మానవులకు మధ్యవర్తియు ఒక్కడే. ఆయనే క్రీస్తు యేసను నరుడు. ।తిమో 2:5 ప్రభువు మన పాపమంతయు ఆయన మీద మోపుకొని, మనకొరకు రక్షణను గెలిచియున్నాడు. ఇతర పాపులకంటే మరియకు ప్రత్యేకత ఏమియు లేదు. కేవలము పరిశుద్ధ కృపనుబట్టి ఆమె దేవుని కుమారుని ధరించుటకు ఎన్నుకొనబడెను. ఆమె కుమారుడు, మన రక్షకుడునైన యేసు రక్తంద్వారాను, ఆయన యిచ్చు అర్హతను బట్టిగాక మరి ఏవిధముగాను మరియ దేవుని సింహాసనము యొద్దకు రాలేదు. మన యెడలను అది అట్లే యున్నది. దేవుని గొఱ్ఱె పిల్ల మాత్రమే లోక పాపమును తీసి వేయగలదు. నిజమైన లూథరన్ సంఘము, లూథరు దినము నందును, యిపుడును యేసునందు మాత్రమే రక్షణ అని బోధించుచున్నది. ఆయన ద్వారా మాత్రమే మనము పరలోకమందున్న మన తండ్రి అని పిలువగలము.

ఈ చివరి దినములలో వారు క్రీస్తువి అని తలంచుచున్న అనేక మత విధానములు గలవు. యేసు ఒలీవతేటల ఇట్టిది సంభవించునని చెప్పి హెచ్చరిక చేసి యున్నాడు. ఈ దినములు తక్కువ చేయబడని యెడల ఎవరును రక్షించబడరుగాని ఏర్పరచబడినవారి కొరకు ఈ దినము లు తక్కువ చేయబడును. గనుక ఎవరైనను క్రీస్తు ఇక్కడ ఉన్నాడు. లేక అక్కడ ఉన్నాడని మీతో చెప్పిన యెడల దానిని నమ్మవద్దు. ఎందుకనగా అబద్ధ ప్రవక్తలు అబద్ధ బోధకులు బయలుదేరి గొప్ప సూచక క్రియను, అద్భుత కార్యములను చేయుదురు. యేర్పరచబడినవారిని సహితము దూరము చేయుదురు. "ఇదిగో నేనే మీకు ముందుగా చెప్పియున్నాను." మత్తయి 24 22-25. యోహాను వీరిని "క్రీస్తు విరోధు"లని పిలుచుచున్నాడు. ఎందుకనగా క్రీస్తు స్థానములో వీరు ఉందురు. । యో 2:18-25 4:1-6. లూథరనులమైన మనము యేసు క్రీస్తు నామమున తప్ప మనుష్యులలో యియ్యబడిన యే నామమున రక్షించబడలేమని నమ్మి బోధించి ఒప్పుకొనుచున్నాము. ఆయన సిలువలో కార్చిన రక్తము ద్వారా, ఆయన మాత్రమే మనలను దేవునితో సమాధానపరచగలడు కొలస్సి 1:20, 2 కొ రి 5:18-21. కొలస్సి 1, హెబ్రీ 1 మరియు యోహాను యోహాను । చదివి, ఆయన రక్షణ కార్యంలో ఎవరి భాగస్వామ్యము లేదని చూడగలము.

మానవుని రక్షించుటకు దేవుని కార్యమును అది చేపట్టెను. యేసు మాత్రమే నిజమైన దేవుడైయుండి మానవుని రక్షణను పరిపూర్ణముగా నెరవేర్చెను. మనము చిన్న ప్రశ్నోత్తరినుండి మన పిల్లలకు యిట్లు బోధించుదుము. "నేను యేసు క్రీస్తును నమ్ముచున్నాను. నిజమైన దేవుడు, పరలోకమునుండి తండ్రి యొద్దనుండి వచ్చియున్నాడని, మరియు నిజమైన మానవుడు, కన్య మరియు వలన పుట్టెనని, నా ప్రభువని, నన్ను ఎవరైతే విమోచించియున్నారో, తప్పిపోయిన, శిక్షార్హమైన వ్యక్తిని, కొని, సమస్త పాపములనుండి విడిపించి, మరణమునుండి మరియు దుష్టుని యొక్క శక్తినుండి వెండి, బంగారములచే గాక, తన పరిశుద్ధ వెల లేని రక్తము ద్వారా, పాపము లేక బాధననుభవించి మరణించెనని, నేను ఆయన స్వంతమని - - - - -. "

## We are saved by the word alone: (మనము వాక్యము ద్వారానే రక్షించబడియున్నాము.)

"ఏలయనగా దేవుని వాక్యము సజీవమై, బలముగలదై ఎటువంటి ఖడ్గము కంటేను వాడిగానుండి, ప్రాణాత్మలను, కీళ్ళను మరియు మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. హెబ్రీ 4:12

మనము మనుష్యులు ఏర్పరచిన "పారంపర్యాచారముల" వలన రక్షించబడలేదు. మనము పోపులు, సంఘ నాయకులు చెప్పిన దాన్ని బట్టి పరలోకమునకు వెళ్లుట లేదు. మనకు ఉచితముగా పాప క్షమాపణ లేదు. ఎందుకనగా ఒక గుంపు వారు చట్టసభలో దీనిని సమర్థించినారు. రక్షణ విషయంలో మనలను జ్ఞానవంతులుగా చేయువాక్యం నమ్ముట వలన మనము రక్షించబడినాము. మనుష్యుని చేయి నీకు అపజయమిచ్చును. నీ స్వంతమును నమ్ము ధైర్యము నీకు లేదు అని ఒక పాత పాట చెప్పుచున్నది. ఒక మనుష్యుని మీద ఆనుకొనుట, ఒక బాణపు మొనపై ఆనుకొన్నట్లుండును. ఒకవేళ మనుష్యుడు దేవుని మాట మాట్లాడిన యెడల ఆ దేవుని మాట రక్షించునుగాని, మనుష్యుని మాట కాదు.

బైబిలు దేవుని మాటయైయున్నది. ముస్లిముల ఖురాన్ దేవుని మాట కాదు. పరిశుద్ధ వ్రాతలని పిలువబడు ఏ యితర మత సంబంధమైనవి దేవుని మాట కావు. "దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది. 2 తి 3:16,17. ఈ వాక్యభాగము, ఇంకా మిగిలిన యితర వాక్యభాగములు క్రైస్తవ బైబిలు నిజముగా దేవుని వాక్యమని, రక్షణ మార్గమును బయలు పరచునని చూడగలము. మీరు పరిశుద్ధ గ్రంథములని చెప్పబడు ఇతర మత గ్రంథములు చదివినచో, అవన్నియు క్రియల ద్వారా రక్షణ గలదని చెప్పుచున్నవి. రక్షణ

మార్గము కృప ద్వారా, విశ్వాసము ద్వారా, క్రీస్తు ద్వారానని దేవుని వాక్యమునందు మాత్రమే గలదు. "మరియు ఇంతకంటె స్థిరమైన ప్రవచన వాక్యము మనకున్నది. తెల్లవారి వేకువచుక్క మీ హృదయములలో ఉదయించు వరకు ఆ వాక్యము చీకటి గల చోటున వెలుగిచ్చు దీపమైనట్టున్నది. దానియందు మీరు లక్ష్యముంచిన యెడల మీకు మేలు. 2 పే :1:19.

బైబిలు దేవుని వాక్యము. అందులో విమోచకుడైన యేసు మనకు బయలు పరచబడెను. బైబిలు ఆయన నిజమైన కథ. మొట్టమొదటి సువార్త యైన ఆ. కాం 3:15 లోనే మనకు యేసు బయలుపరచబడెను. ఆయన సాతాను శిరస్సును చితకగొట్టిన, స్త్రీ విత్తనమైయున్నాడు. సాతాను యేసును పాదములందు నలుగ గొట్టెను. అందువలన యేసు పాపులైన మనుష్యుల చేతులచే శిలువ వేయబడెను. కానీ ఆయన చనిపోయిన తరువాత, మరణమునుండి లేచెను.

యేసు దేవుని వాక్యమని పిలువబడెను. బైబిలు అంతయు ఆయన కథయై యున్నది. "ఆదియందు వాక్యముండెను. ఆ వాక్యము దేవుని యొద్ద వుండెను. ఆ వాక్యము దేవుడైయుండెను. ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమ వలె మనము ఆయన మహిమను కనుగొంటిమి. యో 1:1-14. మనము వాక్యము చదివినపుడు దేవుని మహిమ శరీరము చూడగలము. మన ప్రభువు వాక్యము చదువుటకు మనలను ప్రోత్సహించుచున్నాడు. "లేఖనములు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. యో 5:39.

మనము పాపచీకటితో నున్న లోకంలో నివశించుచున్నాము. వాక్యము చదివి, ధ్యానించుట వలన లోకమునకు నిజమైన వెలుగును పొందగలము. బైబిలు మన పాదములకు దీపము, మన త్రోవకు వెలుగు, ఎందుకనగా రక్షణ మార్గము విశ్వాసము అని దానిలో బయుపరచబడెను. వాక్యము దీని విషయములో స్పష్టముగా నున్నది. లేఖనమంతయు ఒకే స్వరముతో సాక్ష్యమిచ్చుచున్నది. " యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవు రక్షించబడుదువు. అ.కా 16 :31. లూథరన్ అనగానేమి? మేము రక్షించబడినాము అని ఈ క్రింది విధముగా నమ్ము క్రైస్తవుడు మాత్రమే లూథరను అయి ఉన్నాడు.

"కృప ద్వారా, విశ్వాసము ద్వారా, క్రీస్తు ద్వారా, వాక్యము ద్వారా మాత్రమే రక్షణ "

దేవునికి మాత్రమే సమస్త స్తుతి కలుగును.